పబ్లిక్ టాయిలెట్స్ లేక పరేషాన్

- అంతర్రాష్ట్ర మహిళా ప్రయాణికులకు తిప్పలు
- బేల మార్కెట్ కూడలిలో నిర్మించాలని విన్నపం
- పట్టించుకోని అధికారులు



నిత్యం రద్దీగా ఉండే బేలలోని శివాజీ చౌరస్తా

బేల: మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో అంతరాష్ట్ర ప్రయాణికులతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ఇతర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఏళ్ల నుంచి బేల మార్కెట్ కూడలిలో పబ్లిక్ టాయిలెట్స్ లేక అవస్థలు పడుతున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మండల అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తప్పని ఇక్కట్లు..

మండల కేంద్రంలో ప్రధానంగా శివాజీ చౌరస్తా, వారాంతపు సంత, అంబేడ్కర్ చౌరస్తాలు మహారాష్ట్ర సరిహద్దు, మండల ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటాయి. వ్యాపారులు, కూలీలు, రైతులతో పాటు ఇతరులు ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. రోజు వేల సంఖ్యలో వచ్చే ప్రజలు మండల కేంద్రంలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్‌తో పాటు 30 రోజులు, 10 రోజుల ప్రత్యేక ప్రణాళికలు, పల్లె ప్రగతి కార్యక్రమాలు చేపట్టాయి. కానీ మౌలిక వసతులు ఏమాత్రం కల్పించకపోవడంతో ఏళ్ల నుంచి మండలవాసులు అవస్థలు పడుతూనే ఉన్నారు.

నిధులు మంజూరు..

టాయిలెట్స్ నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం రూ.2లక్షలు, ఏడాది క్రితం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.5 లక్షలు మంజూరైనప్పటికీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని చిన్న టాయిలెట్స్ సైతం సరైన నిర్వహణ లేకపోవడంతో నాలుగేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరుకున్నాయి. పబ్లిక్ టాయిలెట్లు లేక పోవడంతో పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో ఒంటికి, రెంటికి ఆరుబయటే కానిస్తున్నారు. దీంతో బస్టాండ్, ప్రధాన కూడళ్లలోని పలుచోట్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

అధికారులు పట్టించుకోవడం లేదు



బేల మార్కెట్ కూడలిలోని శివాజీ, అంబేడ్కర్ చౌరస్తాలలో, వారాంతపు సంత ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్ లేవు. దీంతో పనుల కోసం ఇక్కడికి వచ్చే ప్రజలు ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్స్ నిర్మాణాన్ని నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

– రాపెల్లి కృష్ణ, బేల

మహిళల బాధలు వర్ణనాతీతం



ఆదిలాబాద్, మహారాష్ట్ర వైపు నుంచి ఆర్టీసీ బస్సులు బేలలో నిలిపే క్రమంలో అంతరాష్ట్ర ప్రయాణికులు టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి.

– నిపుంగే వినాయక్, బేల

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో శారద

నార్నూర్: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య పిల్లలకు పునాది వంటిదని సీడీపీవో శారద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలోని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ కమ్యూనిటీ భవన్‌లో అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో విద్యాబోధనపై అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు సులభమైన విధానంలో ఆటపాటల ద్వారా విద్య అందించే కార్యక్రమంపై దశలవారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, వందన, ఉమా, ప్రదీపిక తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



దేగామ విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

బజార్‌హత్నూర్: అకారణంగా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని టెంబి, మంజరంతాండా, ధరంపురి, అనంతపూర్ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం మండలంలోని దేగామ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. వారు మాట్లాడుతూ మండలంలోని దేగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో ఉక్కపోతతో ఇంట్లో ఉండే పరిస్థితి లేదని, చీకట్లో బయటకు వెళ్లాలంటేనే భయాందోలన చెందుతున్నామని పేర్కొన్నారు. ఏఈ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. టెంబి, అనంతపూర్, మాంజరంతండా మాజీ సర్పంచులు సోమ రాంరెడ్డి, నిస్తే కైలాస్, చందర్‌సింగ్, నరేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బేల: నిరుద్యోగులకు ఇచ్చిన హామీల్లో రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీతో 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, మాడవార్ హరీశ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్య పెంచాలన్నారు. సంఘం నాయకులు మహేశ్, పవన్ రెడ్డి, అభిషేక్, అనోజ్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

టెండర్లు పిలవాలని వినతి



ఈఈ రాజేశ్‌ను కలిసిన బోథ్ గ్రామస్తులు

బోథ్: మండల కేంద్రంలోని శివ భక్తమార్కండేయ ఆలయ నిర్మాణ పనులకు త్వరగా టెండర్లు పిలవాలని భక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు వేములవాడలో దేవాదాయ శాఖ ఈఈ రాజేశ్‌ను కలిసి కోరారు. మండలంలో గతంలో నిర్మించిన ఆలయ నిర్మాణాలను సంబంధించిన బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలన్నారు. ఈఈని కలిసిన వారిలో భైరి రవి, వేముల చంద్రమోహన్, మెరుగు భోజన్న, న్యాయవాది పంద్రం శంకర్, తడకపోశెట్టి, ఆడెపు కిరణ్, మాసం అనిల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రజాప్రతినిధులకు సన్మానం

తాంసి: ప్రజాప్రతినిధులు తమ పదవీకాలం ముగిసిన కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం జూలై 4న ముగుస్తుండడంతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సభ్యులకు సన్మానం చేశారు. ఎంపీపీ మంజుల, వైస్ఎంపీపీ రేఖ, ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీటీసీలు కొడాల లక్ష్మి, పండిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జైనథ్‌లో..

జైనథ్: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, ఎంపీపీ మా ర్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డిలకు నేడు ఆత్మీయ సన్మానం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో కోరారు.

డయేరియాతో అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: రానున్న వర్షాకాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏ ఒక్కరూ కూడా డయేరియా వ్యాధి బారిన పడకుండా ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆశ, వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. జూలై 1 నుంచి 30 వరకు ప్రతీ ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రైడే సందర్భంగా గ్రామాల్లో పర్యటించి మలేరియా, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్ఎన్ రాజుబాయి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా మహేందర్



మహేందర్ జాదవ్

నేరడిగొండ: గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా జాదవ్ మహేందర్ ఆరోసారి నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్‌లు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జాదవ్ మహేందర్‌ది మండలంలోని సవర్గాం గ్రామం. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి ఈ పదవి కట్టబెట్టడంపై సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని లంబాడాల ఐక్యత కోసం తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని లంబాడీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గోడం రామారావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మాజీ గిరిజన శాఖ మంత్రి గోడం రామారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. గోడం రామారావు 92వ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ ప్రీతంరెడ్డి, తాంసీ జెడ్పీటీసీ రాజు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు రమణ, పీఏసీఎస్ చైర్మన్‌లు శ్రీకాంత్ రెడ్డి, కధం ప్రశాంత, వెంకన్న నాయకులు పాల్గొన్నారు.

బోథ్: మాజీ మంత్రి గోడం రామారావు జయంతి మంగళవారం మండలంలోని పార్డి బి రాయిసెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల అభివృద్ధికి ఆయన పాటు పడ్డారన్నారు. భూమన్న, లక్ష్మణ్, గంగాధర్, బండు, భీంరావు, రాము, జైతు, మురళి, దత్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

ఇచ్చోడ: ఫొటో, వీడియో గ్రాఫర్లు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ అందిపుచ్చుకుంటూ మరింత సృజనాత్మకత పెంపొందించుకొని వృత్తిలో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దోడ అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా, డివిజన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కుటుంబ భరోసా పథకంలో భాగంగా రూ.10 చెల్లించాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణ సాయంగా రూ.10వేలతో పాటు ప్రమాద బీమా రూ.లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, రాష్ట్ర కార్యదర్శి విజయ్, అజయ్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

బోథ్: రాష్ట్ర మంత్రి వర్గంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారాం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రి లేడన్నారు.

వానాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



ఇచ్చోడ: పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీవో, ఇంద్రవెల్లి ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్యం, నీటి సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య కమిటీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రావ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఇచ్చోడ: టైర్ పంక్చర్ షాపుల్లో టైర్ల మధ్యలో వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో టైర్ పంక్చర్ షాప్ లను పరిశీలించి నీటి నిల్వలపై వారికి అవగాహన కల్పించారు. పాత టైర్ల మధ్యలో నీటి నిల్వలు ఉండటం చాలా ప్రమాదకరమన్నారు.

గ్రామకంఠం భూమిని కాపాడాలని వినతి

బోథ్: మండలంలోని బాబెరతండా (లంబాడితండా) గ్రామకంఠం భూమిని కాపాడాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ సుభాష్ చందర్‌కు విన్నవించారు. గ్రామ కంఠం భూమిలో కొంతమంది పశువుల పాకలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. రెవెన్యూ శాఖ జోక్యం చేసుకొని, పశువుల పాకలను తొలగించి భూమిని కాపాడాలని కోరారు. భూమి సైతం కొంత ఆక్రమణకు గురైందన్నారు. భూమిని సర్వే చేయించాలని కోరారు. త్వరలోనే భూమిని పరిశీలించి, సర్వే చేయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బీజేపీ సంఘటన మంత్రి చంద్రశేఖర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంలు మంగళవారం రాథోడ్ రమేశ్ గృహానికి చేరుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యుల ను పరామర్శించారు. రాథోడ్ రమేశ్ సేవలను కొనియాడారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇంద్రవెల్లి: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బుధవారం సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో పర్యటించనున్నట్లు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు సిరికొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సన్మాన సభకు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ ఆస్పత్రిలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వైద్యులు మంగళవారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ రెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బోథ్: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

బీసీ వసతి గృహం సందర్శన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ పరిశీలించిన ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వసతి గృహంలో నిల్వ ఉన్న వంట సరుకుల నాణ్యత పరిశీలించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పిల్లలకు నోటుబుక్కులు, ప్లేట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి శివకుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల ప్రవీణ్, కేశవ్, రాజు షిండే, తదితరులు ఉన్నారు.

సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి



దుర్వగూడలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: గ్రామాల్లో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. మంగళవారం మండలంలోని దుర్వగూడ, దేవాపూర్ గ్రామాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలతో పాటు పలు రకాల అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలపై అందరికి పూర్తి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ గౌస్ ఆలాం ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, ఆయా గ్రామస్తులు ఉన్నారు.

'గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'



మైసమ్మ ఆలయాన్ని ప్రారంభిస్తున్న గణేశ్ రెడ్డి

తలమడుగు: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉండం గ్రామంలో రూ.2 లక్షలతో నిర్మించిన మైసమ్మషెడ్డు ప్రారంభించారు. అనంతరం ఝరి గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో జెడ్పీ నిధుల నుంచి మంజూరైన సవారీ బంగ్లాకు భూమిపూజ చేశారు. ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, ఎంపీటీసీ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్ రావు, దేవన్న, పోతన్న, రామచందర్, లక్ష్మణ్, మహేందర్, మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ, సఖి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సంకల్ప, హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ కింద 100 రోజుల ప్రత్యేక అవగహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు చట్టాలపై అవగహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ పోక్సో చట్టం, బాల్య వివాహ చట్టం, భారతీయ న్యాయ సంహిత జూలై 1న నుంచి అమలులోకి వచ్చిన చట్టాలను వివరించామన్నారు. సఖి కేంద్రం సిబ్బంది నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అంత్యక్రియల్లో వివక్ష'

నార్నూర్: బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించకుండా వివక్ష చూపారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వం గిరిజన బిడ్డ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను పట్టించుకోలేదన్నారు.

రైతుల అభిప్రాయ సేకరణ

ఇచ్చోడ: రైతుల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం రైతుభరోసా పథకం వర్తింప జేస్తుందని బోథ్ డివిజన్ ఎస్‌డీసీ అరుణ అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. సహకార సంఘం చైర్మన్ సక్కరాం, ఇచ్చోడ సహకార సంఘం సీఈవో ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు సేకరణ..

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ ఉంటుందని బేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు.

జైనథ్: రైతు భరోసా పథకం అమలుకు రైతుల నుంచి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకునేందుకు వీలుగా మండల కేంద్రంలోని రైతువేదికలో మహాజన సభ సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు.

జైనథ్‌లో రైతు నేస్తం

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వార వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు సలహాలు అందించారు. సమగ్ర వ్యవసాయం అనే అంశంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీజన్ ప్రారంభంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనాల ఎంపిక, వర్షభావ పరిస్థితులను ఎదుర్కునేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

వంగిన స్తంభం.. నిలిచిన సరఫరా



బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామంలో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. స్తంభం వంగిపోవడంతో పంట పొలాలకు సరఫరా అయ్యే విద్యుత్ నిలిచిపోయి నెలలు గడుస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. సాగు పనులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఎంతో అవసరమని కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామానికి వచ్చిన సందర్భంలో రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. కానీ వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు స్పందించలేదు.